

సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత, చిత్రంలో కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి

అందరి సహకారంతో స్వర్ణాంధ్ర-2047 ప్రణాళిక

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారంతో స్వర్ణాంధ్ర-2047 కార్యాచరణ ప్రణాళిక తయారీకి చర్యలు తీసుకుంటామని మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికపై సలహాలు, సూచనల స్వీకరణకు సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్‌తో ఆమె మాట్లాడారు. రాష్ట్రం రాబోయే పాతికేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ప్రజల సూచనలు, సలహాలు తీసుకోవడానికి క్యూఆర్ కోడ్ రూపొందించామని.. జిల్లాలో ఇంతవరకు 50 వేల మంది ప్రజలు ఈ కోడ్ స్కాన్ చేసి వివరాలు పొందుపరిచారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో పరిశ్రమలు స్థాపించడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. జిల్లాలో అభివృద్ధికి ఎక్కువగా అవకాశం ఉన్న పరిశ్రమలు, పర్యాటకం, వ్యవసాయ రంగాలపై లోతుగా ఆలోచించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పేదలకు నాణ్యమైన విద్య, సౌకర్యాలు అందించే విధంగా.. భావితరాలకు ఉపయోగపడే విధంగా ప్రణాళిక ఉండాలన్నారు. సీపీఓ రామారావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ రంగాల్లో జిల్లా ప్రగతిని, స్వర్ణాంధ్ర లక్ష్యాలను వివరించారు. జేసీ జాహ్నవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: తితిదే లడ్డూ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని అనిత పేర్కొన్నారు. స్వతంత్ర దర్యాప్తు సంస్థతో సిట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తప్పు చేయనివారు భయపడాల్సిన పనిలేదన్నారు. విజిలెన్స్ విచారణ చేస్తామంటే సుబ్బారెడ్డి ఎందుకు భయపడ్డారో చెప్పాలన్నారు.





ఉద్యాన పంటలకు ఉపాధి ఊతం

ఈనాడు, అనకాపల్లి


★ పండ్లు, పూల తోటల పెంపకానికి నరేగా నేస్తం
★ అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 13,853 ఎకరాల్లో సాగు

జల సంరక్షణ పనులతో పాటు వ్యవసాయానుబంధ రంగాలకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (నరేగా) తోడుగా నిలుస్తోంది. కూలీలకు స్థానికంగా ఉపాధిని చూపించడమే కాకుండా ఉద్యాన పంటల పెట్టుబడికి ఆర్థిక సాయం అందిస్తోంది. పండ్లతో పాటు పూల తోటల సాగును పెద్దఎత్తున ఈ పథకం ద్వారా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఈ ఏడాది 13,853 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నరేగా ద్వారా సాయం అందించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఏటా వీటి సాగును పెంచడంద్వారా రైతుల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని భావిస్తున్నారు.





మామిడి, బొప్పాయి, సపోట, జీడిమామిడి, కొబ్బరి వంటి ఉద్యాన పంటలే ఎక్కువ సాగుచేస్తున్నారు. ఎక్కువ ఆదాయం తెచ్చిపెట్టే పంటలు ఉన్నా పెట్టుబడికి భయపడుతున్నారు. అలాంటి వారికి నరేగా ద్వారా అదనపు సాయం అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. పండ్లు, పూల జాతులకు చెందిన 25 రకాల పంటలకు మూడేళ్ల పాటు పెట్టుబడి సాయం అందజేయనున్నారు. గతేడాది అనకాపల్లి జిల్లాలో వెయ్యి ఎకరాల్లో ఉద్యాన పంటల సాగును నరేగా ద్వారా చేపట్టారు. ఈ ఏడాదికి వచ్చేసరికి ఆ విస్తీర్ణ లక్ష్యం 3,500 ఎకరాలకు పెరిగింది. అల్లూరి జిల్లాలో గతేడాది ఆరు వేల ఎకరాలు లక్ష్యంగా పెట్టుకుంటే ఈ ఏడాది 10,353 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు చేపట్టాలని నిర్దేశించుకున్నారు.



జాబ్ కార్డు ఉంటే చాలు..

అయిదెకరాల కంటే తక్కువ భూమి ఉన్న ఉద్యాన రైతులకు నరేగా ద్వారా పెట్టుబడి సాయం అందుతుంది. జాబ్ కార్డు కలిగి ఉండాలి. భూమి చదును చేయడం నుంచి మొక్కలు వేయడానికి గోతులు తీయడం, నీరు పోయడం, ఎరువుల తదితర సరంజామ ఖర్చుల కోసం రైతు ఖాతాకు నేరుగా సొమ్ములు జమ చేస్తారు. డ్రాగన్ ఫ్రూట్ సాగు ఏటా పెరుగుతోంది. సీతాఫలం, పనస, సిల్వర్ ఓక్ ఇతర పంటలు ఎక్కువగా సాగుచేస్తుంటారు. ఉపాధి పథకం అండగా నిలవడంతో ఎక్కువ మంది కొత్త పంటలు సాగుచేయడానికి ఆసక్తి చూపనున్నారు.

పెట్టుబడి సాయం ఇలా..

తోట (ఎకరాకి)	మొక్కలు	మూడేళ్లలో సాయం (రూ.ల్లో)
మామిడి	70	1,09,950
జీడి మామిడి	70	98,684
కొబ్బరి	60	99,183
నిమ్మ	110	1,46,311
జామ	110	1,46,971
తైవాన్ జామ	444	2,51,224
సపోట	60	95,584
సీతాఫలం	240	2,14,178
సిల్వర్ ఓక్	700	1,52,295
పనస	40	67,163
డ్రాగన్ ఫ్రూట్ (50 సెంట్లు)	900	2,00714
గులాబీ (25 సెంట్లు)	500	62,355
మల్లెపూలు (25 సెంట్లు)	400	55,124
మునగ (25 సెంట్లు)	112	27,515

బహుళ ప్రయోజనాలు..



ఉద్యాన పంటలకు ఉపాధిహామీ నుంచి సాయం అందించడం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయి. రైతులపై పెట్టుబడి భారం పూర్తిగా తగ్గిపోతుంది. వారి జీవన స్థాయి పెరుగుతుంది. పచ్చదనం విస్తరిస్తుంది. పూలతోటలకు పథకాన్ని వర్తింపజేయడం వల్ల మరింత మంది రైతులు లబ్ధి పొందడానికి ముందుకొచ్చే అవకాశం ఉంది.

–పూర్ణిమాదేవి, పీడీ, డ్వామా

పీలాకు అభినందనల వెల్లువ

దేవరాపల్లి, న్యూస్‌టుడే: పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్‌గా శుక్రవారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించిన పీలా గోవింద సత్యనారాయణ అభినందనలు వెల్లువెత్తాయి. ఆయనను ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవి రావు, దువ్వారపు రామారావు, హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, నాయకులు బీజీ కుమార్ తదితరులు సత్కరించి అభినందనలు తెలిపారు.



పీలాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యేలు బండారు, కొణతాల రామకృష్ణ, ఎమ్మెల్సీలు చిరంజీవిరావు, దువ్వారపు రామారావు

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అనకాపల్లి - తంతడి ఆర్టీసీ బస్సు త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. కళాశాల విద్యార్థులు, సాధారణ ప్రయాణికులతో తంతడి నుంచి బయలుదేరిన బస్సు దోసూరు దాటిన తరువాత మడుతూరు లేఅవుట్లు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో తుప్పల్లోకి వెళ్లి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. మరో వాహనంతో బస్సు వెనక్కి లాగారు. మరో రెండు అడుగుల ముందుకెళ్తే పొలాల్లోకి వెళ్లిపోయి ప్రమాదం జరిగేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు.



తుప్పల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

తగ్గనున్న ఉష్ణోగ్రతలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: రాబోయే ఐదు రోజులు పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు ఒక ప్రకటనలో తెలిపారు. పగటి అత్యధిక ఉష్ణోగ్రతలు 37 సెల్సియస్ డిగ్రీల నుంచి 32.6 డిగ్రీలకు.. రాత్రి అత్యధిక ఉష్ణోగ్రతలు 26.7 నుంచి 24.8 డిగ్రీలకు తగ్గుతాయని వివరించారు. ఈనెల 6, 7, 9 తేదీల్లో చిరుజల్లులు పడతాయన్నారు.

జిల్లాలో బెల్టు దుకాణాలు ఉండవు



సుధీర్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎక్కడా మద్యం బెల్టు దుకాణాలు ఉండవని, గరిష్ఠ చిల్లర అమ్మకం ధరలకే మద్యాన్ని విక్రయిస్తారని ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి వి.సుధీర్ స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన నర్సీపట్నం సర్కిల్ స్టేషన్‌ను సందర్శించారు. తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 136 దుకాణాలు మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. వీటికి దరఖాస్తుల స్వీకరణ జరుగుతోందని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే సారా తయారీ, రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టేలా.. గంజాయి వినియోగం, రవాణాను నిరోధించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సారా తయారీ గ్రామాలను గుర్తించి గతంలోని నవోదయం మాదిరి చైతన్య కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. నర్సీపట్నంలో వ్యసన విముక్తి కేంద్రం అవసరాన్ని ఆయన దృష్టికి తేగా, దీన్ని ఏర్పాటు చేయించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట సీఐ సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మసక చీకటిలో ఇసుక దోపిడీ



కేశవరం వద్ద తాండవనదికి ఆనుకుని ఇసుక తవ్విన ప్రదేశం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానాన్ని అక్రమార్కులు జేబులు నింపుకొనే వ్యవహారంగా మార్చుకునే పనిలో పడ్డారు. పాయకరావుపేట మండలం మాసాహెబ్‌పేట రెవెన్యూ పరిధి కేశవరం గ్రామానికి ఆనుకుని ఉన్న జిరాయితీ భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారు. ఈ వ్యవహారం అర్ధరాత్రి 2 గంటల నుంచి ప్రారంభమై, ఉదయం 5 గంటల వరకు కొనసాగుతోంది. ఇక్కడ అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టి వందల సంఖ్యలో టైరు బళ్లపై సమీప ప్రాంతాలకు తరలించి అక్కడ నుంచి ట్రాక్టర్లలో లోడింగ్ చేసి పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఈ తవ్వకాలను అడ్డుకట్ట వేయాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని సమీప రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దందా మాసాహెబ్‌పేటకు చెందిన ఓ వైకాపా నాయకుడి ఆధ్వర్యంలో సాగుతోందని గ్రామస్థులు తెలుపుతున్నారు. తవ్వకాల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. దీంతోపాటు తమ భూములు చౌడు బారిపోతున్నాయని పలువురు సమీప రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సీఐ అప్పన్నను వివరణ కోరగా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి తవ్వకాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

రాష్ట్ర పోటీలకు బాలల ఎంపిక



జెర్సీలు అందుకున్న విద్యార్థులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నానికి 28 మంది రాష్ట్రస్థాయి ఆట్యాపాట్యా పోటీలకు ఎంపికయ్యారు. ఏపీ ఆట్యాపాట్యా సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులో శనివారం నుంచి జరిగే అండర్-14 విభాగంలో పాల్గొనేందుకు విద్యార్థులు శుక్రవారం ఇక్కడి నుంచి పయనమయ్యారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. విద్యాంజలి పాఠశాల ఛైర్మన్ అక్షజ్ కృష్ణ వీరికి జెర్సీలు అందజేశారు. కరస్పాండెంట్ శాంతి ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి ప్రేరణ ఉత్సవానికి ఎలమంచిలి విద్యార్థిని



తల్లితో వైష్ణవి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని దిగుమర్తి వైష్ణవి రాష్ట్రస్థాయి ప్రేరణ ఉత్సవానికి ఎంపికైందని ప్రధానోపాధ్యాయురాలు హిమబిందు తెలిపారు. నవోదయ నిర్వహించిన ప్రేరణ పరీక్షలో బాలిక ప్రతిభ చూపిందన్నారు. గుజరాత్‌లో నిర్వహించనున్న పోటీల్లో అనకాపల్లి జిల్లా తరపున ఈ బాలిక పాల్గొంటుందన్నారు. విద్యార్థి ఎంపికపై ఉపాధ్యాయులు అభినందించారు. బాలికలకు గైడ్ టీచర్‌గా ఎ.సునీత హాజరవుతున్నారు.

మహా కనకదుర్గ!

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అనకాపల్లి గవరపాలెం పార్కు సెంటర్ వద్ద శివశక్తి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో మట్టితో తయారు చేసిన భారీ అమ్మవారి ప్రతిమను నిలబెట్టారు. 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 30 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని తయారుచేయించి మండపంలో కొలువు దీర్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు శివశక్తి ఫ్రెండ్స్ వ్యవస్థాపకులు పీలా రామచంద్రరావు, కాండ్రేగుల అప్పలనాయుడు తెలిపారు.



అందరి సహకారంతో
అడవుల అభివృద్ధి



ఎం.శామ్యూల్

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో అడవుల రక్షణ, అభివృద్ధిపై శ్రద్ధ చూపుతామని డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (డీసీఎఫ్) ఎం.శామ్యూల్ అన్నారు. నర్సీపట్నంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అడవుల తీరు, అభివృద్ధికి అవకాశాలను పరిశీలించి చేపట్టాల్సిన చర్యలపై అంచనాకు వస్తామని వివరించారు. అందరి సహకారంతో అభివృద్ధిని సాధిస్తామని తెలిపారు. వన్యప్రాణులు, జంతువుల మనుగడను సమాజంలో అందరు కాపాడాలని పేర్కొన్నారు. నర్సీపట్నం ప్రాంతంలో నగరవనం అవసరాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా ఈ దిశగా శ్రద్ధ చూపుతామని హామీ ఇచ్చారు. విధుల్లో చేరిన డీసీఎఫ్‌ను సబ్ డీఎఫ్ఓ, రేంజ్ అధికారి, డివిజన్ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.

ఆడపిల్లలకు ఆత్మస్థైర్యమే ఆయుధం

పాయకరావుపేట, న్యూస్‌టుడే

ఆడపిల్లలు ఆత్మస్థైర్యాన్ని ఆయుధంగా చేసుకోవాలని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో జరుగుతున్న రెండు తెలుగు రాష్ట్రాల సీబీఎస్ఈ క్లస్టర్-7 వాలీబాల్, కబడ్డీ పోటీలు శుక్రవారంతో ముగిశాయి.



మాట్లాడుతున్న అనిత..



అండర్-14 కబడ్డీ విజేత పేట శ్రీప్రకాష్ జట్టుతో మంత్రి

రెండు రాష్ట్రాల్లోని 110 పాఠశాలల నుంచి 1,200 మందికి పైగా బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు మంత్రి అనిత చేతులమీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల జోలికి ఎవరైనా వస్తే తాటతీసే విధంగా తల్లిదండ్రులు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఆటలాడే పిల్లలకు మానసిక స్థైర్యం ఎక్కువగా ఉంటుందని వివరించారు. ఇంట్లోనూ, పాఠశాలల్లోనూ ఆడ, మగ పిల్లలను సమానంగానే చూడాలని చెప్పారు. పురుషులకు దీటుగా స్త్రీలు నేడు అన్ని రంగాల్లోనూ సత్తా చాటుతున్నారని తెలిపారు. పాఠశాలల్లో మార్కుల వారీగా సెక్షన్లు విడదీసే సంప్రదాయాలకు స్వస్తి పలకాలన్నారు. చదువులో వెనుకబడినా వేరే రంగంలో రాణించే అవకాశముందని, ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన వారంతా జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. గెలుపు, ఓటమి ముఖ్యం కాదని... ఆటల్లో పాల్గొనడమే కీలకమని వివరించారు. విద్యార్థులను చెడగొట్టేందుకు గంజాయిని అలవాటు చేస్తున్నారని, దీనిపట్ల పిల్లలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం గంజాయిని అరికట్టేందుకు ఉక్కుపాదం మోపుతోందని తెలిపారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత సీహెచ్. వి. కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్. విజయ్‌ప్రకాష్, జిల్లా విశ్రాంత క్రీడాభివృద్ధి అధికారి ఎన్. సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ, ద్వితీయ విజేతలుగా నిలిచిన జట్లు ఇవే..

కబడ్డీ అండర్-14: శ్రీప్రకాష్ విద్యానికేతన్ (పాయకరావుపేట, అనకాపల్లి జిల్లా), న్యూడైమెన్షన్ హైస్కూల్ (భువనగిరి, తెలంగాణా).

కబడ్డీ అండర్-17: హిల్ స్కూల్ (నరసింగపాలెం, కృష్ణాజిల్లా), నికేతన్ స్కూలు(కొండాపూర్, మేడ్చల్ జిల్లా)

కబడ్డీ అండర్-19: ప్రథమస్థానం హార్వెస్ట్ పబ్లిక్ స్కూలు (ఖమ్మం), ది హార్ట్‌ఫుల్ లెర్నింగు సెంటర్ (హైదరాబాదు).

వాలీబాల్ అండర్-14: సంఘమిత్ర స్కూలు (నిజాంపేట) ద్వితీయస్థానంలో డీఏవీ పబ్లిక్ స్కూలు (కూకట్‌పల్లి)

వాలీబాల్ అండర్-17: నవనీత పబ్లిక్ స్కూలు (నెల్లూరు), మాంటిస్సోరి ఎలైట్ స్కూల్ (అనంతపురం).

వాలీబాల్ అండర్-19: డీపీఎస్ పబ్లిక్ స్కూలు (నాచారం, మేడ్చల్ జిల్లా), అక్షర విద్యాలయం(నెల్లూరు).

భవానీ భక్తులకు ప్రత్యేక బస్సులు

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: విజయదశమి వేడుకల్లో భవానీ భక్తుల కోసం ప్రత్యేక బస్సు సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చామని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి పద్మావతి తెలిపారు. అనకాపల్లి నుంచి విజయవాడ వెళ్లి రావడానికి పలు ప్యాకేజీలను అందుబాటులో ఉన్నాయన్నారు. అనకాపల్లి విజయవాడ నేరుగా వెళ్లి దుర్గమ్మ ఆలయాన్ని దర్శించుకొని రావడానికి ఒక్కో టిక్కెట్‌కు రూ. 900గా నిర్ణయించామన్నారు. విజయవాడతోపాటు ద్వారకా తిరుమలకు రూ. 950, ఈ రెండు క్షేత్రాలకు ద్వారపూడి దర్శించుకుని రావడానికి రూ. ఒక వెయ్యిగా నిర్ణయించామన్నారు. అనకాపల్లి నుంచి భద్రాచలం, విజయవాడ, ద్వారకా తిరుమల వెళ్లి రావడానికి రూ. 1,220... పర్ణశాల, ద్వారపూడి కూడా వెళితే రూ. 1300 గా నిర్ణయించామన్నారు. మొత్తం బస్సు బుక్ చేసుకుంటే భక్తులు కోరుకున్న విధంగా ప్యాకేజీలు ఉంటాయన్నారు.

✦ శని, ఆదివారాల్లో అనకాపల్లి, నర్సీపట్నం డిపోల్లో ఉన్న పాసుల జారీ కేంద్రాలు మూసి వేస్తున్నామని పద్మావతి తెలిపారు. సోమవారం నుంచి పాసుల జారీ కేంద్రం పనిచేస్తుందన్నారు.

అంతటా కొరత.. నిత్యం కలత

★ ఉక్కులో తగ్గిపోతున్న మానవ వనరులు

★ ఖనిజాలు.. నిధుల లభ్యతదీ ఇదే పరిస్థితి

న్యూస్‌టుడే, ఉక్కునగరం (స్టీల్‌సెక్టార్-3)

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పూర్తి స్థాయిలో నడుపుతామంటూ ఇటీవల కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ప్రకటనలు చేశారు. 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కర్మాగారాన్ని పూర్తిస్థాయిలో నడపాలంటే ఎంతమంది ఈడీలు, సీజీఎంలు, సిబ్బంది ఉండాలి..? ప్రస్తుతం ఎంతమంది ఉన్నారనేది కనీస పరిశీలన చేయకుండానే ప్రకటనలు చేసేశారని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు.



మానవ వనరుల కొరత ఉన్నా.. సంస్థలో నిరంతరం ఉత్పత్తి సాధించేందుకు కార్మికులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. అయితే కేంద్రం ఉక్కుశాఖ మాత్రం తాజాగా 4 వేల మంది ఒప్పంద కార్మికుల్ని తొలగించేందుకు ఇటీవల చేసిన కొన్ని ప్రయత్నాలు కలకలం రేపాయి. చివరికి ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి జోక్యం చేసుకొని పరిస్థితి చక్కదిద్దినా...ఉద్యోగుల్లో ఆందోళన మాత్రం వీడలేదు.

ఇదీ పరిస్థితి: ఓవైపు ముడిసరకు కొరత, ఇంకో వైపు ఉత్పత్తికి అవసరమైన నిధులు కరవు.. మరోవైపు ఉద్యోగ విరమణలు, అవసరమైన మేరకు సిబ్బందిని భర్తీ చేయకపోవడం... ఇలాంటి కారణాలతో క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సకాలంలో సరైన నిర్ణయాలు, ప్రణాళికలు అమలు చేసే పరిస్థితి లేకపోవడంతో కర్మాగారం అభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతున్నాయి.

● రూ.లక్షల కోట్ల విలువైన కర్మాగారాన్ని నడిపే ప్రధాన అధికారి అయిన సీఎండీ పోస్టు... ప్రస్తుతం ఇన్‌ఛార్జితో నడుస్తుంది. 14 మంది ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు(ఈడీలు) ఉండాల్సి ఉన్నా... ఒక్కరూ లేరు. 72 మంది సీజీఎంలకు కేవలం ఆరుగురే ఉన్నారు. జీఎంలూ 20 నుంచి 30 మంది తక్కువగానే ఉన్నారు.



● మిగిలిన కిందిస్థాయి యువ అధికారుల్లో చాలామంది గత నాలుగేళ్ల నుంచి విశాఖ ఉక్కును వీడి బయటకు వెళ్లిపోయారని హెచ్ఆర్ విభాగం అధికారులు చెబుతున్నారు. టెక్నీషియన్లు, ఛార్జ్‌మెన్లు, జేఓలు సంఖ్య తక్కువగానే ఉంది.

● ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా సిబ్బందిని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు... కర్మాగారాన్ని ఎటువైపు తీసుకెళ్తాయోనని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరిని మార్చుకుని కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేస్తేనే విశాఖ ఉక్కు మనుగడ సాధ్యమవుతుందని కార్మికులు చెబుతున్నారు.

జీఎం దృష్టికి రైల్వే సమస్యలు

అనకాపల్లి పట్టణం: జిల్లాలో రైల్వే సమస్యలను దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ దృష్టికి తీసుకెళ్లామని, వీటికి త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఎంపీ సీఎం రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో జీఎంతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్య రైల్వే హాల్టులు, అండర్ బ్రిడ్జిల నిర్మాణాన్ని జీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

181 కేజీల గంజాయి పట్టివేత

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: మన్యం నుంచి నుంచి మైదానానికి తరలిస్తున్న 181 కేజీల గంజాయిని కృష్ణదేవిపేట పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌ఛార్జి ఎస్.ఐ. సీహెచ్. భీమరాజు కథనం ప్రకారం.. కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు నందనవనం వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. గూడెంకొత్తవీధి మండలం నుంచి వస్తున్న ఆటోలో గంజాయి గుర్తించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం వట్టిబూసల గ్రామానికి చెందిన గెమ్మిల రవి, సరమండ గ్రామానికి చెందిన పాంగి శాంతి, టి. మల్లేష్, చింతపల్లి మండలానికి చెందిన గమ్మిల కిరణ్‌ను పట్టుకొని అరెస్టు చేశామని భీమరాజు తెలిపారు. గంజాయితోపాటు ఆటో, 4సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



శేషుబాబు (పాత చిత్రం)

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి మండలంల్లో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. నక్కపల్లి మండలం మనబాలవానిపాలేనికి చెందిన గొర్ల శేషుబాబు (50) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నారు. మోపెడ్‌పై గురువారం సాయంత్రం నక్కపల్లి బస్టాండు కూడలిలో రోడ్డు దాటుతుండగా, తుని నుంచి విశాఖ వైపు వెళుతున్న బొలెరో వ్యాను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను పోలీసులు తొలుత నక్కపల్లి ఆసుపత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం కేజీహెచ్‌కు పంపించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించినట్లు సీఐ కె. కుమారస్వామి తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. శేషుబాబుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

గొడిచెర్ల వద్ద వృద్ధుడు...

నక్కపల్లి, న్యూస్‌టుడే: గొడిచెర్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ కె. కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఎలమంచిలి మండలం రేగుపాలేనికి చెందిన షేక్ మదీనా (83), పింఛన్ నిమిత్తం బంధువు అబ్దుల్ ఖాదర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై తుని వెళ్తున్నారు. జాతీయ రహదారిపై గొడిచెర్ల కూడలి దాటగానే రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించే క్రమంలో వీరి బైకు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అంబులెన్స్‌లో తుని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మదీనా మృతిచెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కె. కిషోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద దృశ్యం

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు కాపు/ తెలగ అవివాహిత వధూవరులకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి కాపు/తెలగ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విశాఖపట్నం అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌లోని రత్నమాల రెసిడెన్సీలో ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (శనివారం, అక్టోబరు 5న), రేపు (ఆదివారం, అక్టోబరు 6న) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 91549 18858, 80080 01686 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలను పైన తెలిపిన వాట్సాప్ నెంబర్లకు పంపవచ్చు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం

ఏయూకు ఐఎస్ఓ గుర్తింపు కొనసాగింపు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయానికి ఐ. ఎస్. ఓ. గుర్తింపును పొడిగిస్తూ 2027 సెప్టెంబర్ 6 వరకు కొనసాగించనున్నారు. సంబంధిత ధ్రువపత్రాన్ని ఏయూ ఐక్యూఏసీ సమన్వయకర్త ఆచార్య జి. గిరిజాశంకర్.. వీసీ ఆచార్య జి. శశిభూషణరావుకు శుక్రవారం అందించారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	114	110
లైవ్	136	130
డ్రెస్డ్	197	230
స్కిన్‌లెస్	224	240

పశువుల లారీ పట్టివేత

నక్కపల్లి, న్యూస్‌టుడే: అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న లారీని పట్టుకున్నట్లు సీఐ కె. కుమారస్వామి తెలిపారు. విజయనగరం నుంచి విజయవాడ వైపు పశువులను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో సిబ్బందితో కలిసి గురువారం అర్ధరాత్రి కాగిత టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టారు. ఓ లారీలో గుట్టుగా రవాణా చేస్తున్న 36 పశువులను గుర్తించి కేసు నమోదు చేసి, సీజ్ చేశారు. అనంతరం ఇందులోని పశువులను మేపేందుకు పలువురు రైతుల వద్ద ఉంచినట్లు సీఐ వెల్లడించారు.

గెడ్డపాలెం కూడలి వద్ద...

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై గెడ్డపాలెం కూడలి వద్ద అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను పెనుగొల్లుకు చెందిన రక్ష చారిటబుల్ ట్రస్టు సభ్యులు శుక్రవారం అడ్డుకున్నారు. సరకు వ్యాన్ మాదిరిగా వెనుక భాగం పూర్తిగా కప్పేసి ఉంచారు. వాహనం పక్కనుంచి వెళ్తుండగా దుర్వాసన రావడంతో వ్యాన్ అడ్డుకుని పై భాగం పరిశీలించగా, రెండు వరసల్లో 55 పశువులను ఉంచారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వగా, వ్యాన్ అడ్డురోడ్డులోని సర్కిల్ కార్యాలయానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి పశువులను పాయకరావుపేటలోని రైతుల సంరక్షణకు అప్పగించినట్లు ఎస్సై విభీషణరావు తెలిపారు.



పోలీసులు పట్టుకున్న లారీ



వ్యాన్‌లో తరలిస్తున్న పశువులు

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **దేవర** పర్తిసాయి: **కలి** సత్యనారాయణ స్క్రీన్-1: **రామ్‌నగర్ బన్నీ** స్క్రీన్-2: **మత్తు వదలరా-2** వెంకటేశ్వర: **దక్షిణ** శ్రీ సత్య: **జెంటిల్ మేన్** రామచంద్ర: **శ్వాగ్** షిర్డిసాయి: **సత్యం సుందరం**
అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **శ్వాగ్** స్క్రీన్-2: **దేవర**

రెండు రోజులుగా నిలిచిన తాగునీటి సరఫరా

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పట్టణంలో రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షానికి పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయి. తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని ప్రకటించిన అధికారులు అన్ని ప్రాంతాలకు నీటిని ఇవ్వలేకపోయారు. తాగునీటి కోసం పట్టణ ప్రజలు పరుగులు తీస్తున్నారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

రైల్వేస్టేషన్‌లో పనుల పరిశీలన

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పేర్కొన్నారు. స్టేషన్‌లో అసంపూర్తి పనులను శుక్రవారం పరిశీలించారు. పాదచారుల వంతెన, అండర్ గ్రౌండ్ కేబుల్, ప్రయాణికుల వసతి సముదాయం, డ్రైనేజీ నిర్మాణాలు, తాగునీరు, ప్లాట్‌ఫారం, ఫ్లోరింగ్ పనుల పురోగతిపై స్టేషన్ మాస్టర్‌పై చర్చించారు.


ప్లాట్‌ఫాంను పరిశీలిస్తున్న రత్నాకర్

వంతెన లేక వెతలు



పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మాసాహెబ్‌పేట- కేశవరం గ్రామాల మధ్య రాకపోకలు సాగించాలంటే తాండవ నదిపై నిత్యం ప్రమాదకరమైన ప్రయాణం చేయాల్సిందే. మాసాహెబ్‌పేటకు చెందిన అధికమంది రైతుల భూములు నది అవతల వైపు కేశవరం పరిధిలో ఉన్నాయి. దీంతో నిత్యం రైతులు, కూలీలు నది దాటుకుని వెళ్లి రావాలి. ఇటీవలే తాజాగా ఓ యువకుడు నదిపై రాకపోకలు సాగించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెనపై నుంచి వస్తుండగా అదుపు తప్పి కాలుజారి నదిలో కొట్టుకుపోయి మృత్యువాత పడ్డాడు. వారధి ఉంటే తమకు ఇబ్బందులు తీరుతాయని, సంబంధిత అధికారులు, పాలకులు సమస్యపై దృష్టిసారించి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సమీప గ్రామస్థులు కోరుతున్నారు.

వారపు సంతకు దసరా కళ

అచ్యుతాపురం, నక్కపల్లి, న్యూస్‌టుడే: అచ్యుతాపురంలో శుక్రవారం నాటి వారపుసంతకు ఈవారం దసరా కళవచ్చింది. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి నాటుకోళ్లు, గొర్రెలు, మేకలు అధికంగా వచ్చాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా నాటుకోళ్లు కనిపించడంతో అందరూ ఆసక్తిగా చూశారు. కోళ్ల ధరలు భారీగా పెరిగిపోవడంతో కొనుగోలుదారులు ఇబ్బందిపడ్డారు.

★ నక్కపల్లి సంతలో టమాట ధర వినియోగదారులను దారెత్తించింది. దిగుబడులు తగ్గడం, ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ పెరగడంతో ఈ పరిస్థితి నెలకొందని వ్యాపారులు వెల్లడించారు. టమాటా కేజీ రూ. 100, ఉల్లి రూ. 50/60, వంకాయ, బెండ, బీర, దొండ రూ. 60/70, చిక్కుడుకాయలు రూ. 120, బీన్స్ రూ. 120 చొప్పున విక్రయించారు

అంచుల్లో అపాయం

రహదారులకు కోతలతో పొంచి ఉన్న ప్రమాదాలు

గ్రామీణ ప్రాంత రహదారులు ప్రమాదాలకు తావిచ్చేలా ఉన్నాయి. నక్కపల్లి మండలంలో ఇప్పటికీ కొన్ని గ్రామాలకు మట్టిరోడ్లే దిక్కు. మరికొన్ని గ్రామాలకు తారురోడ్లు ఉన్నా, వీటికి నిర్వహణ లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాగిత నుంచి పాటిమీద కూడలి మీదుగా వేంపాడుకు వెళ్లే మార్గంలో తారురోడ్డు అంచు కోతకు గురై పెద్ద గుంత పడింది. ఇక్కడ మలుపు ఉండటంతో వాహన చోదకులు దగ్గరకు వచ్చేంత వరకు గుర్తించలేకపోతున్నారు. దీంతో ఒక్కోసారి అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇదే మార్గంలో ఓ చెరువు వద్ద నిర్మించిన కల్వర్టుకు రక్షణ గోడ దెబ్బతింది. దీనికి తోడు ఇక్కడ కల్వర్టు ఉందని తెలిపే సూచికలు ఏవీ రాకపోకలు సాగించేవారికి కానరావు. - న్యూస్‌టుడే, నక్కపల్లి


రామకృష్ణాపురం వద్ద పోలవరం కాలువ సమీపంలో రోడ్డుపై గుంత

▼ పెదదొడ్డిగల్లు, పెదబోదిగల్లం మార్గంలో మార్గంలో రాకపోకలు సాగించే వారికి రామకృష్ణాపురం వద్ద పోలవరం కాలువ మట్టిరోడ్డు నరకం చూపుతోంది. చినుకు పడితే ఇది చిత్తడిగా మారి వాహనాలు జారిపోతున్నాయి. ఇటీవల వర్షాలకు ఇక్కడ పెద్ద గుంత పడింది. దీంతో భారీ వాహనాలు చాలా జాగ్రత్తగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇక ఆటోల్లో ప్రయాణించేవారు, బడికి వెళ్లే విద్యార్థులు బితుకుబితుకుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడి సమస్యపై ఆటో వాలాలు, స్థానికులు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ఫలితం లేకపోయిందంటూ ఆవేదన చెందుతున్నారు. ఇక రమణయ్యపేట, ముకుందరాజుపేట మధ్యన ఇంచుమించు ఇలాంటి పరిస్థితే ఉంది. దీన్ని ఎవరూ పట్టించుకోవడంలేదు.


వంతెన వద్ద దెబ్బతిన్న రక్షణ స్తంభాలు

భయంభయంగా ప్రయాణాలు



పెదదొడ్డిగల్లు, పెదబోదిగల్లం మీదుగా నక్కపల్లికి, నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్‌కు నిత్యం అనేకమంది ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డులో రామకృష్ణాపురం వద్ద పోలవరం కాలువపై మట్టిరోడ్డు దారుణంగా దెబ్బతింది. వర్షం కురిస్తే ప్రయాణాలు చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపడితే ప్రజలకు మేలు జరుగుతుంది. - గొనగాల రామకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు

అధికారులతో మాట్లాడతా



పెదబోదిగల్లం రహదారి, రమణయ్యపేట రహదారికి సంబంధించి సమస్య పరిష్కారం చూపాల్సింది పోలవరం, జలవనరులశాఖ అధికారులే. దీనిపై వారితోనే మాట్లాడతా. వేంపాడు మార్గంలో రహదారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం జరిగేలా మాట్లాడతా. - డి.సీతారామరాజు, ఎంపీడీఓ

అవీ ఇవీ

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: గుర్రాజుపేట, పెదఉప్పలం, లక్ష్మీపతిరాజుపేట, గుడివాడ, కొత్తపోలవరం, రేవుపోలవరం, బంగారమ్మపాలెం, చినఉప్పలం, ధర్మవరం-అగ్రహారం గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఆరు ట్రాక్టర్లు, పొక్లెయిన్ సీజ్

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పోలవరం కాలువ సమీపంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్ గురువారం రాత్రి పట్టుబడినట్లు గ్రామీణ ఎస్సై ఉపేంద్ర తెలిపారు. వీటిని సీజ్‌చేసి కేసు నమోదుచేసి తహసీల్దార్‌కు అప్పగించామన్నారు.

విధుల్లో చేరిన వీఆర్వోలు

కోటవురట్ల: గ్రామ రెవెన్యూ అధికారులుగా శుక్రవారం పలువురు విధుల్లో చేరారు. పందూరు వీఆర్వోగా జి.సన్యాసిరాజు, కైలాసపట్నం వీఆర్వోగా బి.రామకృష్ణ, పి.కొత్తపల్లి వీఆర్వోగా సీహెచ్ మాణిక్యం బాధ్యతలు స్వీకరించారు.

పశువులకు గర్భకోశ నివారణ చికిత్స

కోటవురట్ల: పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి ప్రసాదరావు సూచించారు. పందూరులో శుక్రవారం ఏడీ నరేష్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటైంది. పశువులకు గర్భకోశ నివారణ చికిత్స చేశారు.

గాయత్రీదేవిగా దుర్గామాత


కాగిత ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న యువతులు

అనకాపల్లి పట్టణం, నెహ్రూచౌక్ (అనకాపల్లి), కశింకోట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కశింకోట కనకదుర్గమ్మను గాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులు, భవానీ మాలధారులు బారులు తీరారు. ఉదయం అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు, అలంకరణ చేశారు. అనకాపల్లి గవరపాలెం శ్రీగౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరి అమ్మవారు సరస్వతిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం చిన్నారులతో సామూహిక సరస్వతీదేవి పూజలు చేయించి, రాత పుస్తకాలు పంపిణీ చేశారు. గౌరీ సంఘం అధ్యక్షులు కర్రి సన్యాశినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఆళ్ల మహాలక్ష్మినాయుడు, మళ్ల సురేష్, వెంకటరమణ పాల్గొన్నారు. గవరపాలెం కామాక్షిదేవి గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. కశింకోట సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి దేవాలయంలో అమ్మవారిని బ్రహ్మచారిణిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అర్చకులు వెలవలపల్లి బాబ్జి ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు.


కశింకోటలో..


బాలాత్రిపురసుందరిగా

అనకాపల్లి, అచ్యుతాపురం, మునగపాక: సతకంపట్టు ఆలయంలో కనకదుర్గను శుక్రవారం బాలత్రిపుర సుందరిగా అలంకరించారు. నూకాలమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. ఎం.జగన్నాథపురంలో దుర్గమ్మ ఘటాల ఊరేగింపు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏటా దసరాలో వచ్చే మొదటి శుక్రవారం అమ్మవారికి ఘటాల ఊరేగింపు నిర్వహించడం ఈ గ్రామంలో ప్రత్యేకత. కళాకారులు నృత్యాలు, కోలాటం చేశారు.

నక్కపల్లి, కోటవురట్ల న్యూస్‌టుడే: కాగిత దుర్గమ్మ ఆలయంలో హోం మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం సాయంత్రం పూజలు చేశారు. అనంతరం పండితులు పూజలు చేయించారు. తర్వాత ఆమె దీపారాధన చేశారు. అనంతరం కమిటీ తరపున ఆమెకు చీర పెట్టారు. పూజల అనంతరం చిన్నారులు దీపాలు వెలిగించారు. నక్కపల్లి స్థానిక సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపంలో దాతల సాయంతో రోజూ భవానీలకు మధ్యాహ్నం బిక్ష ఏర్పాటు చేస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోటవురట్లలో భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి పూజలు చేశారు.


ఎం.జగన్నాథపురంలో మహిళల కోలాటం


గౌరీసంఘంలో సరస్వతీదేవి పూజల్లో పాల్గొన్న బాలలు

ఘనంగా బోనాల ఊరేగింపు

శరన్నవరాత్రుల సందర్భంగా ఉపమాకలో శుక్రవారం బోనాల ఊరేగింపు నిర్వహించారు. దుర్గా భవానీ పీఠం, గురుభవానీ డి.రాంబాబు, కొప్పిశెట్టి సత్యనారాయణ తదితరుల ఆధ్వర్యంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి భవానీ మాలధారులు భారీఎత్తున ఇక్కడకు చేరుకున్నారు. భక్తిపాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ మహిళా భక్తులంతా బోనాలను నెత్తిన పెట్టుకుని వీధుల్లో తిరిగారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. - నక్కపల్లి, న్యూస్‌టుడే



భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ

నక్కపల్లి, న్యూస్‌టుడే: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉపమాక వెంకన్న ఆలయంలో శుక్రవారం నిర్వహించిన ధ్వజారోహణ భక్తిశ్రద్ధలతో సాగింది. ఉదయం ప్రధానార్చకుడు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దపల్లకీలో సతీ సమేతుడైన స్వామివారిని ఉంచి, దీనిపై ధ్వజపటంతో సన్నాయి, వాయిద్యాల నడుమ తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.


పల్లకీలో ఉత్సవమూర్తులు


ధ్వజారోహణ నిర్వహిస్తున్న అర్చకులు

చెడుగుడు పోటీల విజేత సోమలింగపాలెం


బహుమతులు అందచేస్తున్న నిర్వాహకులు

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మరిడిమాంబ పండగ సందర్భంగా జంపపాలెం గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి చెడుగుడు పోటీల్లో సోమలింగపాలెం జట్టు విజేతగా నిలిచింది. మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో విజేతలకు గురువారం రాత్రి సర్పంచి శిలపరశెట్టి దేవకినాయుడు, విరాళదాతలు నగదు బహుమతులు అందచేశారు. రెండు, మూడు, నాలుగు, అయిదు స్థానాల్లో జంపపాలెం, గణపర్తి, వాడ్రాపల్లి, చూచుకొండ జట్లు నిలిచాయి. టెక్కలి శివ తాతారావు, శివకోటి శివ, ఎ.అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలకు ప్రసిద్ధి చెందిన నునపర్తిలో శనివారం నుంచి మూడు రోజులపాటు 9వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీరామ బాల్‌బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్షులు గొంప నరసింహనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరవుతారన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పోటీలను ప్రారంభిస్తారని, ఎంపీ సీఎం రమేశ్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారని తెలిపారు.

కూరుకుపోయిన లారీ.. రాకపోకలకు అవస్థలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: కాగిత-పాటిమీద మార్గంలో శుక్రవారం ఓ లారీ కూరుకుపోయింది. ఈ మార్గం బాగా దెబ్బతిన్నప్పటికీ భారీ వాహనాలు పరుగులు తీస్తున్నాయి. ఈ క్రమంలో పాటిమీద వైపు వెళుతున్న లారీ ఇక్కడున్న గుంతలోకి దిగిపోయింది. ఫలితంగా కొంతసేపు ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు తప్పితే మిగిలిన వాహన రాకపోకలు సాగలేదు. ఈ రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఈ ప్రాంత వాసులు ఆవేదన చెందుతున్నారు.


దిగబడిన లారీ

గోకులం షెడ్లలో అక్రమాలపై విచారణ

కోటవురట్ల, న్యూస్‌టుడే: మినీ గోకులం షెడ్ల నిర్మాణంలో చోటుచేసుకున్న అక్రమాలపై అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. నీలిగుంటలో గోకులం షెడ్లను, రైతుల బ్యాంకు ఖాతాలను విచారణ బృందం అధికారి తిరుమలరావు పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. కోటవురట్ల మండలంలో 270 మంది రైతులు మినీ గోకులాల షెడ్లను నిర్మించుకున్నారని, రైతుల ఖాతాల్లో కాకుండా సాయి బాలాజీ ఏజెన్సీ ఖాతాలో నగదు జమైనట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయని తిరుమలరావు చెప్పారు.


రైతులతో మాట్లాడుతున్న తిరుమలరావు

రోడ్ల మరమ్మతుకు రూ. 63 లక్షల మంజూరు

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారులు మరమ్మతులకు రూ. 63 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. నర్సీపట్నం - తాళ్లపాలెం రహదారికి రూ. 10 లక్షలు, చోడవరం - అనకాపల్లి రహదారి చినబాబుకాలనీ వరకు రూ. 10 లక్షలు, రేబాక - కొండకొప్పాక రహదారికి రూ. 10 లక్షలు, తోటాడ - అనకాపల్లి రహదారికి రూ. 9 లక్షలు, తుమ్మపాల నుంచి వెంకుపాలెం - తగరంపూడి రహదారికి రూ. 10 లక్షలు, మామిడిపాలెం - కొండుపాలెం రహదారికి రూ. 9 లక్షలు, తుమ్మపాల గుండాల కూడలి నుంచి లక్ష్మీదేవిపేట వరకు రూ. 63 లక్షలు మంజూరయ్యాయన్నారు. పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్‌గా శుక్రవారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

తెదేపాలో కష్టపడేవారికి గుర్తింపు

కశింకోట, న్యూస్‌టుడే: తెదేపా కష్టపడి పని చేసేవారికి గుర్తింపు ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నిరూపించారని, దానికి నిదర్శనం రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలికవసతుల సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ నియామకమని తెదేపా నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పీలా ప్రమాణ స్వీకారం సందర్భంగా కశింకోట మండలం చింతలపాలెం గ్రామంలోని శివాలయంలో పూజలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తెదేపా నాయకులు గొంతిన చిరంజీవి, మాజీ సర్పంచులు కర్రి దుర్గనాయుడు, మేడిశెట్టి వెంకటరమణ, జెర్రిపోతుల నూకునాయుడు, కోన రమణ, తెరపల్లి శ్రీను, పచ్చికోర శ్రీనివాసరావు పాల్గొన్నారు.


చింతలపాలెంలో చంద్రబాబు చిత్రపటానికి తెదేపా నాయకుల పాలాభిషేకం

సైబర్ నేరాలపై అప్రమత్తం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ క్రైం సెల్ సీఐ వినోద్‌బాబు సూచించారు హిమశేఖర డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు అపరిచిత వ్యక్తుల మోసపూరిత మాటలను నమ్మవద్దన్నారు. సమావేశంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఐటీకోర్ ఎస్సై బి.సురేష్ పాల్గొన్నారు.

అందరి చొరవతోనే కుష్ఠు నివారణ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కుష్ఠువ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి బాలాజీ తెలిపారు. జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు రెండు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో శుక్రవారం ప్రారంభించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

మద్యం సీసాలతో ఒకరి అరెస్ట్

అనకాపల్లి పట్టణం: రేబాకలో మద్యం తరలిస్తున్న ముమ్మిడి సత్యనారాయణను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతడు మద్యం తరలిస్తుండగా పట్టుకుని 9 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

నాయుడుబాబు సేవలు మరువలేనివి

రాంబిల్లి, న్యూస్‌టుడే: పార్టీ కోసం అహర్నిశలు సేవలు అందించిన తెదేపా జిల్లా బీసీ సెల్ మాజీ ప్రధాన కార్యదర్శి దివంగత లాలం అప్పలనాయుడు (నాయుడుబాబు) సేవలు మరువలేమని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు పేర్కొన్నారు. మండలంలోని గొరపూడి శివారు అప్పన్నపాలెంలో శుక్రవారం నిర్వహించిన నాయుడుబాబు ఆరో వర్ధంతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దివంగత నాయుడుబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో చలపతిరావు మాట్లాడారు. తెదేపా బలోపేతానికి నాయుడుబాబు అందించిన సహకారాన్ని వివరించారు. విశాఖ జిల్లాపరిషత్తు మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవాని, హైకోర్టు విశ్రాంత రిజిస్ట్రార్ పోతల ముత్యాలనాయుడు మాట్లాడారు. తెదేపా మండల కమిటీ అధ్యక్షుడు లాలం తాతబాబు, ఎంపీటీసీ సభ్యుడు లాలం చినసత్యం, మాజీ సర్పంచి లాలం లీలాకాంత, గ్రామస్థులు పాల్గొన్నారు.


నాయుడుబాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న చలపతిరావు

ఉత్తమ దర్యాప్తు అధికారిగా హరి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: హత్య కేసులో తప్పించుకొని తిరుగుతున్న నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న సీఐ బి.హరి సేవలకు గుర్తింపు లభించింది. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా ఎల్విన్‌పేటలో సేవలు అందిస్తున్న సీఐ హరి గతంలో అనకాపల్లి జిల్లాలో పని చేశారు. మాకవరపాలెం, మునగపాక ఠాణాల పరిధిలో 2022, 2024లో జరిగిన మూడు హత్యలకు సంబంధించి తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నారు. దీనిలో భాగంగా ఉత్తమ దర్యాప్తు అధికారిగా ఏబీసీడీ అవార్డును విజయవాడలో డీజీపీ చేతుల మీదుగా అందుకున్నారు.

ఇసుక కొరతతో ఇక్కట్లు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందజేయాలని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, బొప్పే ఉమమహేశ్వరరావు ఆధ్వర్యంలో అనకాపల్లి గవరపాలెం పార్కు కూడలి, పట్టణంలోని సర్వకామదాంబ పార్కు కూడళ్లలో శుక్రవారం సంఘ ప్రతినిధులు, భవన నిర్మాణ కార్మికులతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆందోళన కార్యక్రమాల్లో శ్రీరామ్ మాట్లాడుతూ జిల్లా వాసులంతా నక్కపల్లి నుంచి ఇసుక తెచ్చుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. భవన నిర్మాణ పనులు లేక కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పస్తులు ఉంటున్నారన్నారు. ఇసుక విధానం లోపాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక, న్యూస్‌టుడే: అచ్యుతాపురంలో భవన నిర్మాణ కార్మికులు తట్టలు, పరికరాలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇసుక సరిగా లభించక ఈ రంగంపై ఆధారపడ్డ ఎంతోమంది రోడ్డున పడ్డారన్నారు. ఇసుక లభించక పోవడంతో రేట్లు నిర్మాణ వ్యయం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు రొంగలి రాము, సోమునాయుడు, కర్రి అప్పారావు, రాజాన అప్పలనాయుడు, రమేష్, రాజు, వసంత, మేరుగు నూకరాజు తదితరులు పాల్గొన్నారు. ఎలమంచిలి పట్టణం, మునగపాక మండలం నాగవరం సచివాలయం వద్ద కూడా భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చేపట్టారు. నాగవరంలో కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు పాలిపిని అప్పారావు, సూరిబాబు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రాంబిల్లిలో సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు తహసీల్దారు కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దారు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు నారాయణరావు, రాము, నూకరాజు, గంగరాజు, భవన నిర్మాణ సంఘం నాయకులు రామకృష్ణ, నాగేంద్ర, మంగరాజు, శ్రీను పాల్గొన్నారు.


అచ్యుతాపురంలో వినతిపత్రం అందిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నక్కపల్లిలో వీరు శుక్రవారం నిరసన తెలిపారు. చాలాచోట్ల గత ప్రభుత్వం కంటే అధిక ధరలున్నాయని, వీటిని తగ్గించి అందరికీ అందుబాటులో ఉండే ధరలు అమలు చేయాలన్నారు. డిపోల్లో ఇసుక అందుబాటులో ఉంచి అందరికీ పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎం.రాజేష్, శ్రీను, బుజ్జి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

?: అనకాపల్లిలోని శాఖ వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో అంధకారం అలుముకుని రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం. - బుగతా శ్రీనివాసరావు, అనకాపల్లి

✓: సిబ్బందిని పంపి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - నానాజీ, జీవీఎంసీ విద్యుత్తు విభాగం జోనల్ ఏఈ, అనకాపల్లి

పిచ్చిమొక్కల తొలగింపు

స్పందనకు వందనం

మునగపాక, న్యూస్‌టుడే: అనకాపల్లి బైపాస్ నుంచి తోటాడ వరకు రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చిమొక్కలపై ‘ఈనాడు’లో ‘మేమున్నాం.. మీకు తోడుగా’ శీర్షికన ఇటీవల చిత్ర కథనం ప్రచురితమైంది. దీనిపై కూటమి నాయకులు స్పందించి పొక్లెయిన్‌తో శుక్రవారం ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

ఆధ్యాత్మిక భావనతో మంచి సమాజం



నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ప్రజల్లో ఆధ్యాత్మిక భావనలు మంచి సమాజానికి ఉపకరిస్తాయని తహసీల్దార్ రామారావు అన్నారు. ఆర్యవైశ్య సంఘాల సభ్యుల సహకారంతో బంక మట్టితో శివలింగాల తయారీని శుక్రవారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. భోగ లింగేశ్వర ధార్మిక సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సమితి ప్రతినిధులు అయ్యప్ప, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

◀ జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తహసీల్దార్ రామారావు

తుప్పల్లో కాలువ.. సాగునీరు చేరేదెలా?



కాలువ కనిపించకుండా దట్టంగా తుప్పలు

వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది ఎలిపి కాలువ. చీడికాడ మండలం కోనాం జలాశయం పరిధిలోని ఈ కాలువ పూడిపోయి తుప్పలు దట్టంగా పెరిగాయి. కాలువ పొడువునా ఇదే పరిస్థితి. జలాశయం నుంచి నీటిని విడుదల చేసినా.. పొలాలకు సక్రమంగా అందడం లేదని రైతులు వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, చీడికాడ

నిర్మాణం సరే.. నిర్వహణ ఏదీ?

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు



ఎం.గదబూరులో తుప్పల మధ్య బస్‌షెల్టర్

చీడికాడ మండలంలోని పలు మార్గాల్లో బస్ షెల్టర్లు నిర్వహణ కొరవడి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వీటి నిర్మాణంపై ఉన్న శ్రద్ధ నిర్వహణపై లేకపోవడంతో ప్రయాణికులు వేచి ఉండేందుకు వీల్లేకుండా పోతున్నాయి. కోనాం - విజయరాజుపేట మార్గంలో కోనాం, ఎం.గదబూరు, ఎస్.గదబూరు, అప్పలరాజుపురం వద్ద గతంలో నిర్మించిన షెల్టర్లు పాడయ్యాయి. ఎస్.గదబూరు బస్‌షెల్టర్ చుట్టూ తుప్పలు పెరిగాయి. చీడికాడ - చోడవరం రోడ్డులో చీడికాడ మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కొన్నేళ్లుగా వినియోగంలో లేదు. ఉప్పరగూడెం బస్‌షెల్టర్ అధ్వానంగా ఉంది. తురువోలు - చోడవరం మార్గంలో చెట్టుపల్లి తూనిక కేంద్రం వద్ద షెల్టర్ శిథిలమైంది. చుక్కపల్లిలోనూ ఇదే పరిస్థితి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కొద్దిపాటి మరమ్మతులు చేస్తే ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయి. ఆ దిశగా దృష్టిసారించాల్సిన అవసరముంది.



చెట్టుపల్లి కాటా వద్ద..



ఉప్పరగూడెంలో..

– న్యూస్‌టుడే, చీడికాడ

కలిగొట్ల వంతెనకు తీరనున్న భూసమస్య

అప్రోచ్ రోడ్డు నిర్మాణంపై కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టి

దేవరాపల్లి, న్యూస్‌టుడే

శారదా నదిపై కలిగొట్ల వద్ద దశాబ్దాల కిందట నిర్మించిన వంతెనకు అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు అడ్డంకిగా ఉన్న భూసమస్య త్వరలోనే పరిష్కారమయ్యే ఆస్కారముంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి ఆగస్టులో వంతెన అప్రోచ్ రోడ్డు సమస్యను 'ఈనాడు' తీసుకువెళ్లింది. రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడిన ఆయన సమస్య పరిష్కారంపై చర్చించారు. కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ఈ నెల 3న ఈ వంతెనను పరిశీలించారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమి వివరాలను కలెక్టర్ ముందుంచారు. నలుగురు రైతులకు చెందిన 2.5 ఎకరాల భూమికి పరిహారం చెల్లిస్తే.. సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించారు. అక్కడే ఉన్న ఉప తహసీల్దారు అప్పారావు, సర్వేయర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రైతుల నుంచి సేకరించిన భూమికి సంబంధించిన పూర్తి వివరాలతో ఈ నెల 14న కలెక్టరేట్‌కు రావాలని ఉప తహసీల్దార్‌ను ఆదేశించారు.

ఈ వంతెన అందుబాటులోకి వస్తే మాడుగుల నుంచి చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల ప్రజలు విశాఖకు రాకపోకలు సాగించేందుకు మార్గం సుగమం అవుతుంది.



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టరు విజయకృష్ణన్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



రాష్ట్ర విభజనకు ముందు ఈ వంతెన నిర్మితమైంది. ఇరువైపులా అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో వినియోగంలోకి రాలేదు. కలిగొట్ల వైపు ప్రభుత్వ భూమి ఉండటంతో ఆ వైపు భూసమస్య లేదు. వేచలం వైపు రోడ్డు నిర్మాణానికి రైతులకు చెందిన సుమారు 2.5 ఎకరాల భూమి అవసరమైంది. అప్పట్లో నలుగురు రైతులకు చెందిన భూమిని సేకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పరిహారం చెల్లించకపోవడంతో రోడ్డు నిర్మాణానికి భూమి ఇచ్చేందుకు రైతులు నిరాకరించారు. ఆ సమయంలోనే రాష్ట్ర విభజన జరగడంతో ఈ విషయం మరుగుపడింది. ఆ తర్వాత రెండు సార్లు ఎన్నికలు జరిగి ప్రభుత్వాలు మారినా సమస్య పరిష్కారంపై దృష్టిసారించలేదు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: **జోకర్ ఫోలి అడు, కలి, సత్యం సుందరం**, ఆడి2: **స్వాగ్** ఆడి3: **దేవర**, ఆది4: **దేవర, సత్యం సుందరం** రాజు:**శ్వాగ్**, బంగార్రాజు: **దేవర**
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: **సత్యం సుందరం**, సాయిలక్ష్మి: **శ్వాగ్**, పూర్ణా: **దేవర**

అ వీ ఇ వీ

సమస్యలపై సభాపతికి వినతి

నాతవరం, న్యూస్‌టుడే: నాతవరంలోని ప్రధాన సమస్యలపై అమెరికా పర్యటనలో ఉన్న శాసన సభాపతి అయ్యన్నపాత్రుడుకు ఎన్నారై విభాగం నుంచి పైలా వెంకటరమణ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అట్లాంటా ప్రాంతంలో అయ్యన్నను కలిసి సమస్యలపై చర్చించి పరిష్కరించాలని కోరినట్లు వెంకటరమణ చెప్పారు.

ఆటస్థలం మంజూరుకు వినతి

గొలుగొండ: గొలుగొండలో పిల్లలు ఆడుకునేందుకు స్థలం మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దారు శ్రీనివాసరావుకు సర్పంచి అప్పారావు వినతిపత్రం అందజేశారు. రాము, సత్యనారాయణ, ప్రసాద్ వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

సిగ్నల్ సమస్య పరిష్కరించండి

దేవరాపల్లి: కలిగొట్లలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఉన్నా.. సిగ్నల్స్ సరిగా అందక సెల్‌ఫోన్ వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గొర్రుపోటు రామ్మూర్తి నాయుడు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. విశాఖలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో అధికారులు పాల్ విలియమ్స్, శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

కాశీపురంలో బోరు తవ్వకం ప్రారంభం

దేవరాపల్లి: కాశీపురం పంచాయతీ ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీటి సదుపాయం కల్పించనున్నట్లు సర్పంచి వరలక్ష్మి, తెదేపా మండల అధ్యక్షుడు సూర్యనారాయణ చెప్పారు. బోరు తవ్వకం పనులను శుక్రవారం ప్రారంభించారు. వార్డు సభ్యురాలు దేవి, మాజీ సర్పంచి అక్కుతాత, సన్నిబాబు, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

అబ్కారీ సీఐగా ప్రసాద్

మాడుగుల గ్రామీణం: అబ్కారీ శాఖ మాడుగుల సీఐగా సీహెచ్‌వీఎస్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఎంపీడీవోగా అప్పారావు

మాడుగుల గ్రామీణం: ఎంపీడీవోగా కొంకి అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా కరప మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. 2014 నుంచి 19 వరకు మాడుగుల ఈవోఆర్డీగా పనిచేశారు.

గురుకుల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్‌గా రఘు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: తెనుగుపూడి బాలుర గురుకుల విద్యాలయ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా పాంగి రఘు బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా సమన్వయాధికారిణి రూపావతి నుంచి నియామక పత్రం అందుకున్నారు.

కర్మాగారామా.. కారాగారమా?

స్వచ్ఛతకు దూరంగా గోవాడ సుగర్స్



భద్రతా సిబ్బంది విశ్రాంతి గదుల వద్ద..



అకౌంట్స్ కార్యాలయం వెనుక ఇలా..

గోవాడ చక్కెర కర్మాగారంలో పచ్చదనం, పరిశుభ్రత మచ్చుకైనా కనిపించడం లేదు. తుప్పలు పెరిగి పరిసరాలన్నీ దుర్గంధభరితంగా మారాయి. మరుగుదొడ్లు వినియోగంలో లేకపోవడంతో కార్మికులు, ఉద్యోగులు బహిరంగంగానే మూత్ర విసర్జన చేస్తున్నారు. పరిపాలన, అక్కౌంట్స్, వ్యవసాయ విభాగాలున్న కాంప్లెక్సు భవనం, భద్రతా సిబ్బంది విశ్రాంతి తీసుకునే షెడ్డు కారాగారాన్ని తలపిస్తున్నాయి. పచ్చదనం పెంపునకు ఏటా రూ.50 వేలు ఖర్చు చేస్తున్నట్లు లెక్కల్లో చూపుతున్నా.. మొక్కలు కనిపించడం లేదు. కర్మాగారం ఎండీగా వి.వి. రమణరావు ఉన్నప్పుడు కడియం నుంచి వందలాది మొక్కలు తెచ్చి నాటారు. వాటిలో ఒక్కటీ ఇప్పుడు లేదు. కార్యాలయాల పరిసరాలనైనా శుభ్రంగా ఉంచేందుకు యాజమాన్యం దృష్టిసారించాల్సిన అవసరముంది.

– న్యూస్‌టుడే, చోడవరం

ఆదర్శ గ్రామాలుగా సమ్మెద, చింతలపూడి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: చింతలపూడి పంచాయతీలోని రెండు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయడం గర్వంగా ఉందని సర్పంచి దొమ్మంగి బోడెమ్మ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో సమ్మెద, చింతలపూడి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు శుక్రవారం గ్రామసభలో వెల్లడించారు. ఐటీడీఏ ఉద్యోగులు ఇప్పటికే ఈ రెండు గ్రామాల్లో సర్వే చేశారన్నారు. గ్రామసభ అనంతరం వీఆర్వోలు కాసప్ప, పంచాయతీ కార్యదర్శి రెహ్మాన్‌ను సన్మానించారు. తామరబ్బ సర్పంచి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు గౌరమ్మ, సన్యాసమ్మ, మహేష్, చిన్న తదితరులు పాల్గొన్నారు.



వీఆర్వో కాసప్ప, కార్యదర్శి రెహ్మాన్‌ని సత్కరిస్తున్న సర్పంచి బోడెమ్మ తదితరులు

కసిరెడ్డిపాలెంలో తాగునీటి ఎద్దడి

రావికమతం, న్యూస్‌టుడే: తట్టబంద శివారు కసిరెడ్డిపాలెం ప్రజలు వర్షాకాలంలోనూ తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకు లేకపోవడంతో చేతి బోర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. 250 మందికిపైగా జనాభా ఉన్న గ్రామంలో మూడు బోర్లే ఉన్నాయి. ప్రాథమిక పాఠశాల, గొల్లవిల్లి సత్తిబాబు ఇంటి వద్దనున్న బోర్లు పనిచేయడం లేదు. రచ్చబండ వద్ద బోరు ఒక్కటే పనిచేస్తోంది. అధికారులు స్పందించి బోర్ల మరమ్మతుకు చర్యలు చేపట్టాలని మహిళలు కోరుతున్నారు. జల్ జీవన్ మిషన్‌లో ట్యాంకు నిర్మించే ప్రతిపాదన ఉందని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రమేష్ చెప్పారు. బోర్ల మరమ్మతు చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి రామలింగేశ్వరరావు పేర్కొన్నారు.



పనిచేయని చేతిపంపు

బోడిమెట్ట క్వారీ సీజ్



రికార్డులు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి

మాకవరపాలెం, న్యూస్‌టుడే: మాకవరపాలెం సమీపంలో అనధికారంగా నిర్వహిస్తున్న బోడిమెట్ట క్వారీని సీజ్ చేయాలంటూ నర్సీపట్నం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లు చేయడంపై 'ఈనాడు'లో గురువారం ప్రచురితమైన 'పేలుళ్లతో బెంబేలు' కథనం ప్రచురితమైంది. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో నర్సీపట్నం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి గురువారం క్వారీని పరిశీలించారు. సర్వే నం. 30లో ఉన్న ఈ క్వారీ విస్తీర్ణం, ఎంత విస్తీర్ణంలో పేలుళ్లు చేశారు, నిర్వహణకు ఏమేం అనుమతులు తీసుకున్నారని ఉప తహసీల్దారు సోమశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. పేలుళ్ల కారణంగా సమీపంలో నివాసాలు బీటలు వారుతున్నాయని పలువురు చెప్పడంతో క్వారీని సీజ్ చేయాలని ఆదేశించారు. రాయిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టరును సీజ్ చేయాలని ఎస్సై దామోదర్‌నాయుడుకు సూచించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబాలకు పరిహారం చెక్కుల పంపిణీ



రైతు భార్యకు పరిహారం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు, ఎండీ సన్యాసినాయుడు

చోడవరం, న్యూస్‌టుడే: గోవాడ చక్కెర కర్మాగారాన్ని గాడిలో పెట్టే చర్యలకు శ్రీకారం చుడుతున్నట్లు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని పరిశీలిస్తే.. ఆదాయం, అప్పుల మధ్య రూ. 130 కోట్ల వ్యత్యాసం కనిపిస్తోందన్నారు. కర్మాగారానికి చెరకు సరఫరా చేసిన రైతుల్లో మృతుల కుటుంబాలకు శుక్రవారం పరిహారం చెక్కులు అందజేశారు. 141 కుటుంబాలకు రూ.40 లక్షల చెక్కులు ఇచ్చినట్లు ఎండీ సన్యాసినాయుడు చెప్పారు. వ్యవసాయ సలహాదారులు రామం, రాము, కార్మిక సంఘాల ప్రతినిధులు భాస్కరరావు, రామునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

దసరాకు బకాయిలు చెల్లించాలి

చక్కెర కర్మాగారానికి చెరకు సరఫరా చేసిన రైతులకు, కార్మికులకు దసరా పండగలోగా బకాయిలు చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ డిమాండు చేశారు. కర్మాగారంలో రూ. ఐదు కోట్ల విలువైన చక్కెర, మొలాసిస్ నిల్వలు ఉన్నాయన్నారు. వాటి విక్రయించి బకాయిలు చెల్లించడంపై దృష్టిసారించాలని సూచించారు. చోడవరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు ఆనందేశ్వరరావు, సూర్యనారాయణ, సత్యారావు, గోవిందు, వెంకట్, నెహ్రూబాబు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

వర్షాలు తగ్గినా.. అవే ఇక్కట్లు

రోలుగుంట, న్యూస్‌టుడే: వర్షాలు తగ్గుముఖం పట్టినా.. బీఎన్ రోడ్డులో ప్రయాణ ఇక్కట్లు తగ్గడం లేదు. రహదారి గోతుల్లో వాహనాలు కూరుకుపోతున్నాయి. వెలంకాయలపాలెం మొదలు కొత్తకోట, మేడివాడ, రావికమతం చోట్ల రోడ్డు అధ్వానంగా తయారైంది. పంచాయతీ నిధులతో సర్పంచులు తాత్కాలిక మరమ్మతులు చేసినా మూణ్నాళ్ల ముచ్చటే అయ్యాయి. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.



మట్టితో గోతులను చదును చేస్తున్న డోజర్

పంచాయతీ లెక్కలపై పాలకవర్గం సంతృప్తి

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: గొలుగొండ మండలం సీహెచ్.నాగాపురం పంచాయతీలో అభివృద్ధి పనులకు సంబంధించి శుక్రవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాలకవర్గంతో సమావేశమయ్యారు. ఖర్చుచేసిన నిధులకు సంబంధించి లెక్కలు చూపారు. తాగునీరు, గ్రామీణ రహదారులు, వీధికాలువలు మరమ్మతులకు సంబంధించి ఖర్చు చేసిన నిధులుకు రికార్డులు వివరించారు. గ్రామంలో గురువారం జరిగిన గ్రామసభలో లెక్కలు చూపలేదంటూ పాలకవర్గం సభ్యులు సభ బహిష్కరించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పాలకవర్గానికి శ్రీనివాస్ లెక్కలు చూపడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ తాను మూడు పంచాయతీలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నానని.. ఒకేసారి మూడు సభలు నిర్వహించడంతో అందుబాటులో లేక తొలిరోజు రికార్డులు చూపలేకపోయానన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

కె.కోటపాడు, న్యూస్‌టుడే

సమస్య: గుల్లిపల్లి నుంచి హిమగిరి కాలనీకి వెళ్లే దారిలో గెడ్డపై వంతెన లేక రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం.
– వేచలపు దేముడు, హిమగిరి కాలని

సమాధానం: వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. –బాలాజీ అప్పారావు, ఏఈ, కె.కోటపాడు

చోడవరం, న్యూస్‌టుడే

సమస్య: సింహాద్రిపురంలో వీధి దీపాలు నెల రోజులుగా వెలగడం లేదు.
–కె.స్వామి, స్థానికుడు

సమాధానం: వీధి దీపాలను పరిశీలించి వెలిగేలా చూస్తాం. అవసరమైతే కొత్తవి ఏర్పాటు చేస్తాం. – భవాని, సర్పంచి, సింహాద్రిపురం

మౌనికకు దాతల తోడ్పాటు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: హరియాణాలో ఈ నెల 6 నుంచి జరగనున్న యూత్ సీనియర్స్ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు హాజరుకానున్న బొంతు మౌనికకు నర్సీపట్నానికి చెందిన వ్యాపారవేత్తలు వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రీకాంత్, సుమ, శ్రావణ్ ఆర్థికంగా తోడ్పాటు అందించారు. 80 కేజీల విభాగంలో బాక్సింగ్‌లో తలపడనున్న మౌనిక పతకం సాధిస్తే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశాలు వస్తాయని నింజాస్ అకాడమీ ఛైర్మన్ నారాయణరావు పేర్కొన్నారు.

ఇసుక రవాణాకు అనుమతివ్వండి

భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక పథకాన్ని తక్షణం అమలు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం నర్సీపట్నంలో ఆందోళన చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోటేశ్వరరావు నాయకత్వాన వీరంతా స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి ర్యాలీ చేపట్టారు. శ్రీకన్య కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం సబ్ కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. ఇసుక కష్టాలు తీర్చడంతో పాటు కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇసుక కొరతతో కార్మికులంతా రోడ్డున పడినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గబ్బాడలోని ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను పునరుద్ధరించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఆర్డీఓ వి.వి.రమణకు దీనిపై వినతిపత్రం అందజేశారు. నాయకులు అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి, శివ భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు రామకృష్ణ, సత్తిబాబు పాల్గొన్నారు.



సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నాలో కార్మికులు



చీడికాడలో భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

నర్సీపట్నం అర్బన్: గబ్బాడ యార్డులో నిల్వ ఉన్న ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ కోరారు. ఇసుక సరఫరా చేయాలని కలెక్టర్‌ను కొద్దిరోజుల కిందట కోరామని, ఇప్పటికీ సమాధానం లేదన్నారు. నర్సీపట్నంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇసుక సరఫరా ప్రారంభించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌ఛైర్మన్ కోనేటి రామకృష్ణ పాల్గొన్నారు.

చీడికాడ, న్యూస్‌టుడే: ఇసుక లభ్యత లేక నిర్మాణాలు నిలిచిపోయాయని సీపీఎం మండల కార్యదర్శి దేముడునాయుడు పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక పస్తులుండాల్సి వస్తోందన్నారు. ఇసుక సమస్యను పరిష్కరించాలని డిమాండు చేస్తూ భవన నిర్మాణ కార్మికులతో కలిసి శుక్రవారం ఆందోళన చేపట్టారు. నదీ పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుక రవాణాకు అనుమతించాలని కోరారు.

దుర్గమ్మని దర్శించి.. మనసారా స్మరించి



నాతవరం కనకదుర్గ ఆలయంలో పారాయణం



గోవాడ భవాని మండపంలో పూజలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. బలిఘట్టంలో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. కుంకుమ పూజలు, లలిత హోమం నిర్వహించారు. నర్సీపట్నం ఆలయంలో సూర్యనమస్కారాలు, మహాలింగార్చన, చండీపారాయణ, సామూహిక లక్ష కుంకుమార్చనలు, అన్నప్రసాద వితరణ చేశారు.

గాయత్రీదేవిగా భక్తులకు దర్శనం

నర్సీపట్నం: దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో గాయత్రీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. భవానీలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాతవరం, కృష్ణదేవిపేట: నాతవరానికి చెందిన మహిళా భక్త బృందం సభ్యులు సామూహిక లలిత సహస్ర నామ పారాయణం చేశారు. ఎ.శరభవరం, మల్లుభూపాలపట్నంలోనూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. కొత్తమల్లంపేట, చోద్యం, కృష్ణదేవిపేట, పాత కృష్ణదేవిపేట, అమ్మపేట గ్రామాల్లో భవానీలు, మహిళలు కుంకుమ పూజలు చేశారు.



నర్సీపట్నంలో అమ్మవార్ల అలంకరణ

చోడవరం/పట్టణం: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవి అవతారంలో కొలువుదీరారు. సహస్ర నిమ్మకాయల పూజ, హోమం నిర్వహించారు. గోవాడలోని దుర్గాదేవి మండపంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

మాడుగుల గ్రామీణం: మాడుగులలో దుర్గాదేవిని గాయత్రీదేవిగా అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

బుచ్చెయ్యపేట, రావికమతం: సీతయ్యపేట దుర్గామల్లేశ్వర ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం చేశారు. దిబ్బిడి, బుచ్చెయ్యపేట, రాజాం, తురకలపూడి, విజయరామరాజుపేట, వడ్డాదిలో మండపాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వమ్మవరంలో దుర్గాదేవి ఆలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు మద్దిపాటి సత్యనారాయణమూర్తి చౌదరి, భాగ్యలక్ష్మి దంపతులు నిత్యాన్నదానం, భవానీలకు అల్పాహారం అందించేందుకు ముందుకువచ్చారు. 2014లో దుర్గాదేవి ఆలయాన్ని నిర్మించారు. అమ్మవారికి వెండి కిరీటం, హారం చేయించారు. కొమిరలో రామాలయం ఎదుట శుక్రవారం రాత్రి దుర్గాదేవి అంబలం పూజ వేడుకగా జరిగింది. రావికమతం, మాడుగుల, బుచ్చెయ్యపేట మండలాల నుంచి అధిక సంఖ్యలో భవానీలు హాజరయ్యారు. చినపాచిల కోదండ రామాలయం ప్రధానార్చకులు గోపాలం ఆచార్యులు కలశ పూజ, వినాయక, శివ పార్వతులు, దుర్గాదేవికి పూజలు చేశారు. భవానీలు భక్తి గీతాలను ఆలపించారు.



కొమిరలో దుర్గాదేవి అంబలం పూజ

బృంద చర్చలో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర 2047పై ఇటీవల నిర్వహించిన బృంద చర్చలో చోడవరం డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు కృష్ణా చందు, గాయత్రి, ధనలక్ష్మికి కలెక్టర్ విజయకృష్ణన్ ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, అధ్యాపకులు వీరిని అభినందించారు. పీడీ మూర్తి, రామలక్ష్మి, కృష్ణారావు, మల్లిబాబు, మాల్యాద్రి, రత్నభారతి పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, అధ్యాపకులు ▶



వైభవంగా సహస్రనామార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి శుక్రవారం సహస్రనామార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కళ్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. తులసీదళాలతో దేవతామూర్తులకు సహస్రనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.

పెందుర్తి

– న్యూస్‌టుడే, సబ్బవరం

సమస్య: సబ్బవరం నుంచి చినగొల్లలపాలెం వెళ్లే దారిలో ఎస్‌టీబీఎల్ సినిమాహాలు వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. గత 15 రోజులుగా చెత్తను తొలగించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు కుళ్లి తీవ్ర దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– సీహెచ్. వెంకటేశ్వరరావు, సబ్బవరం

సమాధానం: పరిశీలించి పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగిస్తాం. – కె.మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శి సబ్బవరం

అవీ ఇవీ

■ **చీమలపల్లి - పోర్లుపాలెం రహదారి పనుల ప్రారంభం**

చీమలపల్లి(వేపగుంట), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు చీమలపల్లి - పోర్లుపాలెం రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. భూగర్భ డ్రైనేజీ పనులు కారణంగా ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో స్థానికులు నడవడానికి సైతం వీలులేకుండా పోయింది. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు వెలువడ్డాయి. కార్పొరేటర్ ముమ్మన దేముడు స్పందించి యూజీడీ విభాగం అధికారులతో మాట్లాడి ప్రమాదకరంగా ఉన్న ప్రదేశంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు. శుక్రవారం కార్పొరేటరు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

మధురానగర్(విజయవాడ), న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎం.ఎస్.ఎం.ఇ.డి.సి.) ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ ముత్యాలంపాడులోని ఎం.ఎస్.ఎం.ఇ. కార్యాలయంలో ఛైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరిట యువతను మోసం చేసిందని విమర్శించారు. ఎం.ఎస్.ఎం.ఇ. ద్వారా యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. ఉద్యోగాలంటే కేవలం ప్రభుత్వ కొలువులనే భావనను నిరుద్యోగ యువత విడనాడి ఎం.ఎస్.ఎం.ఇ. అందించే ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని పారిశ్రామికవేత్తలుగా స్థిరపడాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల హామీకి కట్టుబడి ఉందని, నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఎం.ఎస్.ఎం.ఇ.పై తనకు అవగాహన ఉందని, దేశంలో ఏడో స్థానంలో ఉన్న ఏపీని అత్యున్నత స్థానానికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎంఎస్‌ఎంఈ సెర్ప్ శాఖ అధికారి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్తం అంటే వారికి తెలియదు

బూతులు మాట్లాడే వైకాపా నాయకులకు ప్రాయశ్చిత్తం అంటే తెలియదని శివశంకర్ పేర్కొన్నారు. మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్షపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న తమ్మిరెడ్డి శివశంకర్

కానిస్టేబుల్ అభ్యర్థుల్లో కోటి ఆశలు..

నియామక ప్రక్రియను త్వరలో ప్రారంభించనున్న కూటమి ప్రభుత్వం

వేపగుంట, న్యూస్‌టుడే



ప్రభుత్వ ఉద్యోగం అంటే ప్రతిఒక్కరికీ ఓ గుర్తింపు. పోలీసు శాఖలో ఉద్యోగం పొందితే ఆ ఆనందమే వేరు. అలాంటి శాఖలో ఉద్యోగం కోసం రెండేళ్లుగా వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువకులకు ఇటీవల హోంమంత్రి అనిత చేసిన ప్రకటన కొత్త ఊపిరినిచ్చింది. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియను మరో వారం రోజుల్లో మొదలు పెడతామని హోంమంత్రి చెప్పడంతో గతంలో దరఖాస్తు చేసుకున్న వారంతా సంతోషంతో ఉన్నారు. దసరా పండగ వేళ కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో ఎంతోమంది కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురింపచేశాయంటున్నారు అభ్యర్థులు.

విశాఖ జిల్లాకు సంబంధించి..

గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 6100 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కోసం 2022 నవంబరులో ప్రకటన విడుదల చేసింది. వీటిలో విశాఖ జిల్లాకు సంబంధించి 187 సివిల్ పోస్టులతో పాటు ఏపీఎస్పీకి సంబంధించి మరికొన్ని పోస్టులను మంజూరు చేసింది. రాష్ట్రం మొత్తం మీద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ప్రాథమిక రాత పరీక్ష రాసి 95,208 మంది అర్హత సాధించారు. అనంతరం పీఎంటీ, పీఈటీ పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ గత ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో వారంతా నిరుత్సాహానికి గురయ్యారు. మరో ఉద్యోగానికి వెళ్ల లేక రెండున్నరేళ్లుగా గందరగోళానికి గురయ్యారు. ఎట్టకేలకు రాష్ట్ర హోంమంత్రి గతంలో నిలిచిపోయిన కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియను పునఃప్రారంభిస్తామని ప్రకటించడంతో మళ్లీ అభ్యర్థుల్లో నూతన ఉత్సాహం వచ్చినట్లయింది. ఈ ప్రక్రియ సజావుగా జరిగితే త్వరలోనే పోలీస్ రాష్ట్రవ్యాప్తంగా 6100 కానిస్టేబుల్ ఉద్యోగాల్లో యువతీయువకులు కొత్తగా కొలువుదీరే అవకాశం ఏర్పడుతుంది.

రూ.30 వేలు అప్పుచేసి కోచింగ్‌కు వెళ్లా..



అమ్మానాన్నా చనిపోయారు. నేను, చెల్లి ఉన్నాం. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో రూ.30 వేలు అప్పు చేసి కోచింగ్ తీసుకున్నా. ప్రాథమిక పరీక్షల్లో పాసయ్యాను. వెంటనే మిగిలిన పరీక్షలు నిర్వహించి ఉంటే ఈ పాటికే ఉద్యోగంలో చేరేవాడ్ని. ఏది ఏమైనా ఆగిపోయిన ప్రక్రియ ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరం.

– బి.రవికుమార్, కానిస్టేబుల్ అభ్యర్థి, గవరజగ్గయ్యపాలెం బీసీ కాలనీ

ఈ ఉద్యోగం కోసం చాలా కష్టపడుతున్నా..



మా నాన్న చనిపోయారు. అమ్మ గృహిణి. కానిస్టేబుల్ ఉద్యోగం కోసం చాలా కష్టపడ్డాను. చివరకు ప్రాథమిక పరీక్షల్లో అర్హత సాధించాను. అనంతరం ప్రక్రియ నిలిచిపోవడంతో గత్యంతరం లేక ప్రయివేటు సంస్థలో చిరు ఉద్యోగం చేస్తున్నాను. కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ మరో వారంలో ప్రారంభం అవుతుందంటే చాలా సంతోషంగా ఉంది. కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించి అమ్మకోరిక తీర్చుతా. – ఎన్.నరేంద్ర కుమార్, కానిస్టేబుల్ అభ్యర్థి, దుర్గానగర్ కాలనీ

కుటుంబ పోషణ కోసం..



కానిస్టేబుల్ ప్రాథమిక రాత పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాను. మిగిలిన ఫిజికల్ పరీక్షల ప్రక్రియ నిలిచిపోవడంతో కుటుంబ పోషణ కోసం తాత్కాలికంగా ఓ ప్రయివేటు కంపెనీలో చేరాను. అయినా ఆర్థిక ఇబ్బందులే. కూటమి ప్రభుత్వ వచ్చిన వెంటనే ఆయా పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడం శుభపరిణామం. గత ప్రభుత్వం మాదిరిలా కాకుండా వీలైనంత తొందరగా పోస్టులను భర్తీ చేయాలి.

– వినోద్‌కుమార్, కానిస్టేబుల్ అభ్యర్థి, గవరజగ్గయ్యపాలెం

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

పాలవలస(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి పాలవలస హిందుజా విద్యుత్తు కేంద్రం నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హిందుజా విద్యుత్తు కేంద్రం ఎదుట శుక్రవారం పాలవలస గ్రామస్థులు చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందుజా యాజమాన్యం ఇచ్చిన అగ్రిమెంట్ ప్రకారం మిగతా ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. హిందుజా యాష్‌పాండు నుంచి విడుదల అవుతున్న నీటి వల్ల దెబ్బతిన్న రైతుల పొలాలకు పరిహారం చెల్లించాలని, భూగర్భజలాలు కలుషితం కాకుండా కాపాడాలని, బొగ్గు, బూడిద లారీల కాలుష్యాన్ని అరికట్టాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. నిరసనలో చుక్క వెంకన్న, పాల నగేశ్, పాలరెడ్డి, కాకి అప్పలరెడ్డి, పిట్టా వెంకటరెడ్డి, వాకా పోలయ్య తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న పాలవలస గ్రామస్థులు

ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయిని చిన్నమ్మాయి

పెందుర్తి, న్యూస్‌టుడే: వృత్తి విద్య శిక్షణలో భాగంగా అందిస్తున్న ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్.చిన్నమ్మాయి పేర్కొన్నారు. పెందుర్తిలోని మారుతీ కార్ల గ్యారేజీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఆమె శుక్రవారం కలిశారు. శిక్షణలో నేర్చుకుంటున్న వివరాలను ఆరా తీశారు. ఇంటర్న్‌షిప్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఒకేషనల్ శిక్షకుడు మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు పెంచుకోవడంపై శిక్షణ

పెందుర్తి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులు పెంచుకోవడంపై పెందుర్తి టీటీడీసీ సమావేశ మందిరంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వివిధ మండలాల ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు ఈ శిక్షణలో పాలుపంచుకున్నారు. కోర్సు డైరెక్టర్ కొల్లి వెంకటరావు, సహాయ డైరెక్టర్ కె.కరుణాకర్‌రావు ఆదాయ వనరులు పెంచుకోవడంపై అధికారులకు సూచనలు చేశారు. ఆయా అంశాలను క్షేత్ర స్థాయిలో అమలు చేసి పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న కోర్స్ సహాయ డైరెక్టర్ కె.కరుణాకర్‌రావు

బదిలీపై వచ్చిన అధికారులు విధుల్లో చేరిక



ధనిశెట్టి శ్రీనివాస్ | బొండా చైతన్య | సీహెచ్ అప్పారావు

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా సబ్బవరం మండలానికి వచ్చిన అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా ధనిశెట్టి శ్రీనివాస్ అచ్యుతాపురం మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయన గతంలో గొలుగొండ, జి.మాడుగులలో పనిచేశారు. ఈయన స్వస్థలం కాకినాడ.

★ ఈవోపీఆర్‌డీగా బొండా చైతన్య వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఓ.మహేస్ బదిలీపై చోడవరం వెళ్లగా అక్కడ పనిచేస్తున్న బొండా చైతన్య సబ్బవరం వచ్చారు. ఈమె గతంలో చీడికాడ, జీకేవీధి మండలాల్లో పనిచేశారు. ఈమె స్వస్థలం నక్కపల్లి మండలం గొడిచెర్ల.

★ డిప్యూటీ తహసీల్దారుగా సీహెచ్ అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో పద్మనాభం, నర్సీపట్నం, గాజువాక, రోలుగుంట, చోడవరం, కోటపాడు, నాతవరం, అచ్యుతాపురం, అనకాపల్లి ఆర్డీవో కార్యాలయాల్లో వివిధ స్థాయిల్లో పనిచేశారు.

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల ఈవోపీఆర్డీగా కె.ధర్మారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఈవోపీఆర్డీగా పనిచేసిన రమేశ్‌నాయుడు భీమిలికి బదిలీపై వెళ్లారు.

ఒత్తిడిని జయిస్తే జీవితం సుఖమయం

పెందుర్తి, న్యూస్‌టుడే: ఒత్తిడిని నియంత్రణలో ఉంచుకుంటే జీవితం సుఖమయంగా ఉంటుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సీకే బాబు పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఒత్తిడి నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ ఫ్లోరా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీకేబాబు పాల్గొని మాట్లాడారు. సమస్యలు సృష్టించే నిర్ణయాలు తీసుకోవడం, భావోద్వేగాలపై అవగాహన లేకపోవడం, అసూయ, ద్వేషం కారణంగా మనిషి ఒత్తిడికి గురవుతాడన్నారు. ఒత్తిడిని జయించే విధానాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్, వైస్ ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు, ఏవో జి.రవిబాబు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు సి.కె.బాబు

సాయినాథుడి ఆలయానికి మహాద్వారం ఏర్పాటు

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ కాలనీలోని శిర్డీ సాయినాథుడి ఆలయానికి మహాద్వారాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. కాలనీకి చెందిన శ్యామ్, వాసం వెంకటేశ్వరరావు, కొఠారి శ్రీనివాస్ దంపతుల ఆర్థిక సాయంతో ఈ ద్వారం ఏర్పాటు చేస్తున్నట్లు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం పూజలు నిర్వహించి ద్వారబంధం ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సీహెచ్‌వీ.రమణమూర్తి, వి.శంకర్‌ప్రసాద్, నూకరాజు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.




ఆలయ ద్వారాల ఏర్పాటు వేడుకలో పాల్గొన్న దాతలు, కాలనీ సంఘం ప్రతినిధులు

పోర్టులో ముగిసిన హిందీ పక్షోత్సవాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మేజర్ పోర్టుల్లో అధికార భాషా ప్రయోగాన్ని ప్రోత్సహించడం, పర్యవేక్షించడం కోసం కేంద్ర నౌకాయాన, పోర్టులు, జలవనరుల మంత్రిత్వ శాఖ సూచనల మేరకు విశాఖ పోర్టు అథారిటీ(వీపీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ పక్షోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. వీపీఏ పరిపాలన భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో వీపీఏ ఉప ఛైర్మన్ దుర్గేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికార భాష వినియోగంలో దేశంలోని ప్రధాన పోర్టుల్లో వీపీఏ మూడోస్థానంలో నిలిచిందన్నారు. అనంతరం పోర్టు అధికారులు, సిబ్బందికి హిందీలో నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య విజిలెన్స్ అధికారి పీఎస్‌ఎల్ స్వామి, కార్యదర్శి టి.వేణుగోపాల్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పాములకు ఆవాసంగా పచ్చికబయళ్లు



రహదారి పక్కన ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 98వ వార్డు షిప్‌యార్డ్ లేఅవుట్ పార్కు సమీపంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయి పాములకు నిలయంగా మారాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తుప్పలు బాగా పెరిగిపోయాయి. దీంతో కాలనీవాసులు రాత్రివేళల్లో రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. ఇక్కడ పిచ్చిమొక్కలను తొలగించాలని సచివాలయం, జోనల్ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోలేదని కాలనీవాసులు అంటున్నారు. మరోవైపు ఈ ప్రాంతంలో వీధిదీపాలు పూర్తిస్థాయిలో లేవని స్థానికులు వాపోతున్నారు. పాలకులు, అధికారులు వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

వార్డు సమస్యలపై వినతి

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి కోరారు. ఈమేరకు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను శుక్రవారం కలిసి సమస్యలను వివరించడంతో పాటు వినతిపత్రం అందజేశారు. వార్డులోని ఇంటింటికీ కుళాయి ద్వారా నీటిని సరఫరా చేయాలని, రోడ్లు, కాలువలు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, హైమాస్టు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, తుప్పుపట్టిన స్తంభాలను మార్చాలని కమిషనర్‌ను కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి

వేద స్వరూపిణి.. జ్ఞాన ప్రదాయిని

గాయత్రీ అవతారంలో పూజలందుకున్న జగన్మాత



సుజాతనగర్‌లో గాయత్రీమాత



సప్తగిరినగర్‌లో ధాన్యలక్ష్మి



శారదాపీఠంలోని జగన్మాత



ఎస్ఆర్‌పురంలో..



ప్రహ్లాదపురం ఫ్రేమ్‌వర్క్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



పిట్టవాని పాలెంలో..



కలపాక సామాజిక భవనం వద్ద..



లంకెలపాలెంలో..



శ్రీనివాసనగర్ దేవీపీఠం ఆధ్వర్యంలో..



నాయుడుతోట పంచముఖ గాయత్రీదేవి



శ్రమశక్తినగర్ పంచముఖ గాయత్రీ ఆలయంలో సామూహిక కుంకుమార్చన



బాలాజీగార్డెన్స్ అపార్ట్‌మెంట్‌లో భక్తుల పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జగన్మాత వేద స్వరూపిణి గాయత్రీమాతగా పూజలందుకుంది. వివిధ ఆలయాలు, సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి ఆరాధించారు. ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు చేసి, వేదపారాయణాలు పఠించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు భక్తులకు ఉచితంగా ప్రసాదాలు అందజేశారు.
– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, సబ్బవరం, పరవాడ



రవినగర్ కల్యాణ వేంకటేశ్వరుడి సన్నిధిలో పారాయణం చేస్తున్న భక్తులు



దేశపాత్రునిపాలెం హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో..



పాపయ్యరాజుపాలెం పిరమిడ్ కేంద్రంలో భక్తి గీతాలాపన



దేవీపురంలో సంగీత విభావరి

రేషన్ వినియోగదారుడిపై ఎండీఎం డ్రైవర్ దాడి

వేపగుంట, న్యూస్‌టుడే: రేషన్ బండి వద్దకు వెళ్లి ఈ నెల బియ్యం బస్తాలు తక్కువ తెచ్చావేంటి అని అడిగినందుకు ఎండీఎం వాహన డ్రైవరు రేషన్ వినియోగదారుడ్ని గాయపరిచిన ఘటన శుక్రవారం వేపగుంట సమీప వెంకటసాయినగర్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటసాయినగర్‌కు చెందిన గుదిరెడ్ల సోమినాయుడు ఎండీఎం వాహనం రాగానే రేషన్ తీసుకునేందుకు వాహనం వద్దకు వెళ్లాడు. రేషన్ లేదని ఎండీఎం వాహన నిర్వాహకుడు కంపర కిరణ్ చెప్పాడు. రేషన్ ఎందుకు తక్కువ తెచ్చావని సోమినాయుడు అడగడంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో సోమినాయుడు ముఖంపై కిరణ్ బలంగా కొట్టడంతో ఎడమకన్ను భాగాన రక్తస్రావమైంది. వెంటనే సోమినాయుడు ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రి వైద్యులు కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం పంపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రిలోని బాధితుడి వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన సోమినాయుడు

ధ్వంసమైన రహదారికి మరమ్మతులు

పరవాడ, న్యూస్‌టుడే

గాజువాక - ఎలమంచిలి ప్రధాన రహదారిలోని పరవాడ పైడిమాంబ ఆలయ సమీపంలో ధ్వంసమైన రహదారికి శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ పెద్దపెద్ద గోతులు ఏర్పడి రాళ్లుదేలడంతో రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు నానా ఇబ్బందులు పడేవారు. వర్షం పడితే గుంతలు చెరువులను తలపించడంతో పాటు వాహనాలు తరచూ గోతుల్లో మొరాయించేవి. 'భారీ గుంతలు.. వాహనాల మొరాయింపు' శీర్షికతో గతనెల 29న 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గుంతలను నల్లపిక్కతో పూడ్చివేసి తారు వేయడంతో చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రహదారికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం


ఈనాడు కథనానికి స్పందన

వానొచ్చినా.. ఎండొచ్చినా.. తిప్పలే..

సబ్బవరం మండలం అసకపల్లి నుంచి లంకెలపాలెం వెళ్లే రహదారి దారుణంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువును తలపించిన రోడ్డు ప్రస్తుతం ఎండలకు ఎండి బురదమయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు బురదలో ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం ఆదమరుపుగా ఉన్నా జారి గాయాలపాలవుతున్నారు. ఈ రహదారి అభివృద్ధికి గత వైకాపా ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసిందని ప్రకటించిందే తప్ప పనులు మాత్రం చేపట్టలేదు. రహదారిలో భారీ గుంతలు ఉండటంతో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు లంకెలపాలెం నుంచి అనకాపల్లి మీదుగా సబ్బవరం చేరుకుంటున్నారు. అదనంగా 12 కి.మీ. ప్రయాణించాల్సి వస్తోందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, అధికారులు దృష్టి సారించి రోడ్డు అభివృద్ధికి కృషి చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సబ్బవరం

దర్పణం





అలరించిన విద్యార్థినుల నృత్య ప్రదర్శన

సింహగిరిపై దసరా వేడుకలు

సింహాచలం: సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం సింహగిరిపై కళావేదిక వద్ద దసరా సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయిని భాను ఆధ్వర్యంలో విద్యార్థులు జానపద నృత్యాలు, పులివేషాలతో అలరించారు. దేవస్థానం ఈవో వేండ్ర త్రినాథరావు విద్యార్థులకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేసి అభినందించారు. ఏదయా మీదయా.. అంటూ విద్యార్థులు ఆలపించిన అలనాటి దసరా పాట పాత రోజులను గుర్తు చేసింది. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఎన్.ఆనంద్‌కుమార్, రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.